www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 14 అక్టోబరు 2023

5

ఏలూరు



19న జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు



ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటల నుండి ఏలూరులోని జెడ్‌పి సమావేశ మందిరంలో జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అధ్యక్షతన నిర్వహిస్తామని జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు అజెండాలో అంశాలపై నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

భూ సమస్యను పరిష్కరించేనా..!

- దోసపాడు అసైన్డ్ భూముల సమస్యపై రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం
- వందెకరాలకుపైగా అసైన్డ్ భూమి బడాబాబుల చేతుల్లోనే
- తమ భూములు అప్పగించాలని ఏళ్ల తరబడి దళితులు పోరుబాట
- సుదీర్ఘకాలంగా జెసి కోర్టులో పెండింగ్
- తాము బతికుండగా న్యాయం చేస్తారా అంటూ బాధితుల ఆవేదన



చెరువులో చేపలు పడుతున్న వ్యకాస ఆలిండియా కార్యదర్శి బి.వెంకట్, నేతలు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

దోసపాడు అసైన్డ్ భూముల సమస్యను పరిష్కరించడంలో రెవెన్యూ యంత్రాంగం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఏళ్ల తరబడి సమస్యను నాన్చుతూ బడాబాబులకు పరోక్షంగా అధికారులు కొమ్ముకాస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. సమస్య జెసి కోర్టుకు చేరి ఏళ్లు గడుస్తున్నా పరిష్కారం కాకపోవడంపై బాధితులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. తాము బతికుండగా సమస్యను పరిష్కరిస్తారా అంటూ వేదనకు గురవుతున్నారు. దెందులూరు మండలం దోసపాడులో దాదాపు 155 ఎకరాల అసైన్డ్ భూమిని దశాబ్దాల కిందట ప్రభుత్వం నిరుపేదలైన దళితులకు పంపిణీ చేసింది. అప్పట్లో అమాయక ప్రజలకు మాయమాటలు చెప్పి మోసగించి బడాబాబులు అసైన్డ్ భూములను తమ కబంధహస్తాల్లో పెట్టుకున్నారు. చేపల చెరువులు తవ్వి దర్జాగా అనుభవిస్తున్నారు. ప్రతియేటా రూ.కోట్లు దండుకుంటున్నారు. నిబంధనల ప్రకారం పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్, సీలింగ్ వంటి భూములకు సంబంధించి కొనుగోళ్లు, అమ్మకాలు నిషిద్ధం. ఇప్పటికీ దోసపాడులోని అసైన్డ్ భూములు దళితుల పేరు మీదనే ఉన్నాయి. తమ భూములు తమకు అప్పగించాలంటూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దళితులు పోరాడుతున్నారు. పాదయాత్రలు, ఆందోళనలు, నిరసన ప్రదర్శనలు ఎన్నో చేశారు. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా, రాష్ట్ర, జాతీయ నాయకులు సైతం దోసపాడు వచ్చి దళితులకు అండగా నిలిచారు. భూసమస్యను పరిష్కరిస్తామంటూ మండల, జిల్లా రెవెన్యూ అధికారులు సైతం బాధితులకు హామీ ఇచ్చారు. అయితే ఏళ్లు గడిచిపోతున్నా సమస్య మాత్రం పరిష్కరించడం లేదు. తమ భూముల కోసం పోరాడుతున్న బాధితులపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెడుతున్న పరిస్థితి ఉంది. తమ భూముల కోసం 120 కుటుంబాలు అలుపెరగని పోరాటం చేస్తున్నాయి. దోసపాడు భూములకు సంబంధించి 72 ఎకరాలకు సంబంధించిన సమస్య జాయింట్ కలెక్టర్ కోర్టులో ఉంది. 2005లో కొంతభూమికి సంబంధించి, తర్వాత మరికొంత భూమికి సంబంధించి జెసి కోర్టుకు చేరింది. అయితే తీర్పు మాత్రం వెలువడలేదు. సమస్య ఎప్పటికి పరిష్కారమవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. సమస్యను పరిష్కరించాల్సిన రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆవేదన బాధితుల్లో నెలకొంది. దోసపాడు భూములకు సంబంధించి సమగ్రంగా సర్వే చేసి సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు కాలయాపన చేస్తుండటంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భూములు అనుభవిస్తున్న వ్యక్తులు బడాబాబులు కావడంతో అధికార యంత్రాంగమంతా వారికి అండగా నిలబడతుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. అసైన్డ్ భూమి ఉన్నట్లు స్పష్టంగా రికార్డుల్లో ఉంది. ఆ భూములు ఎవరి పేరు మీద ఉన్నాయో రెవెన్యూ రికార్డుల్లో ఉంటుంది. చట్టప్రకారం కొనుగోలు, అమ్మకాలు నిషిద్ధం. అయినప్పటికీ సమస్యను తేల్చకపోవడం ఏమిటో ఏ ఒక్కరికీ అర్థం కావడం లేదు. ఇప్పటికైనా అధికారులు తమ భూసమస్యను త్వరితగతిన పరిష్కరించి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. అధికారులు ఏం చేస్తారో వేచిచూడాలి.



విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న రైతులు

విద్యుత్ సక్రమంగా అందించండి

ములగలంపల్లి సబ్‌స్టేషన్ వద్ద రైతుల ఆందోళన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

వ్యవసాయనికి విద్యుత్‌ను కోతలు లేకుండా సక్రమంగా అందించాలని ములగలంపల్లి సబ్‌స్టేషన్ వద్ద రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. కొన్ని రోజులుగా వర్షాలు లేకపోవడంతో వ్యవసాయానికి తగినంత నీళ్లు లేక తాము సాగులో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇదే సమయంలో విద్యుత్ శాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అప్రకటిత కరెంట్ కోతలు విధించడంతో పంటలకు సరైన తడి లేక అల్లాడిపోతున్నామని వాపోయారు. ఇదే విధంగా కోతలు కొనసాగిస్తే త్వరలోనే పంటలు పూర్తిగా ఎండిపోయే పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వ్యవసాయానికి విద్యుత్ సక్రమంగా అందించాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల ఉపాధ్యక్షులు బిక్కిన వీరసత్యం, రైతులు వెంకటేశ్వరరావు, కె.నాగు, ఎం.శ్రీను, శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టుకార్డుల ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

సిపిఎస్, జిపిఎస్ రద్దు కోరుతూ ముఖ్యమంత్రికి పోస్టుకార్డులు

యుటిఎఫ్ ఆధ్వర్యాన ప్రారంభించిన ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిపిఎస్, జిపిఎస్ రద్దు చేయాలని, ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని కోరుతూ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ముఖ్యమంత్రికి పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని శుక్రవారం స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సాబ్జీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రతిపక్షంలో ఉండగా అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సిపిఎస్‌ను, రద్దు చేసి ఓపిఎస్‌ను ఇస్తానని చెప్పి ఇప్పుడు జిపిఎస్ అనే ఇంకో మోసపూరిత పెన్షన్ విధానాన్ని తీసుకొచ్చారన్నారు. దీనివల్ల ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్దఎత్తున నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ సిపిఎస్ వల్ల ఉద్యోగ విరమణ చేసిన అనేక మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు చాలా తక్కువ పెన్షన్‌తో బతకడానికి కష్టంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొత్తగా మంత్రి మండలి ఆమోదం తెలిపిన జిపిఎస్ అనేది మెరుగైనది కాదని, సిపిఎస్‌కు మరో రూపం అని అన్నారు. కంట్రిబ్యూషన్ లేని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ మెమో నెంబర్.57ను అనుసరించి 2004 సెప్టెంబర్ ఒకటో తేదీకి ముందు నియామక ప్రక్రియ పూర్తయిన వారికి తక్షణమే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు ముస్తఫాలీ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం సాధించే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, జిల్లా సహాధ్యక్షులు వి.కనకదుర్గ, జిల్లా కోశాధికారి జివి.రంగమోహన్ తదితరులు పాల్గొన్నారు.

18న ఉపాధి హామీ పరిరక్షణ రాష్ట్ర సదస్సు

జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

'ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలి, పని దినాలు, వేతనాలు పెంచుకోవాలి, పట్టణ ప్రాంతాల్లో కూడా అమలు చేయాలి' అనే డిమాండ్‌తో సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 18న ఉదయం 10 గంటలకు ఏలూరులోని కాశీవిశ్వేశ్వర కళ్యాణ మండపంలో జరిగే రాష్ట్ర సదస్సులో ఉపాధి హామీ కూలీలు, వ్యవసాయ కార్మికులు, పేదలు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సమావేశానికి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి సీతారాం మాట్లాడుతూ ఈ నెల 22 నుండి మూడు జాతాలు రాష్ట్ర నలుమూలల నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలను కలుపుతూ ఈ మూడు జాతాలు విజయవాడ చేరుకుంటాయన్నారు. నవంబర్ 7న విజయవాడలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తామని తెలిపారు. దీంతోపాటు ఈ నెల 20వ తేదీలోగా వివిధ అంశాలపై రాష్ట్రస్థాయి సదస్సులు ఆయా జిల్లాల్లో నిర్వహించాలనే కర్తవ్యంలో భాగంగా ఈ నెల 18న ఏలూరులో ఉపాధిహామీ చట్టాన్ని కాపాడుకుందామనే పేరుతో రాష్ట్ర సదస్సు జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సుకు ఎంపీ, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకులు శివదాసన్ ముఖ్యఅతిథిగా విచ్చేస్తారన్నారు. ప్రధానోపన్యాసకులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు పోరండ్ల శ్రీనివాస్‌తోపాటు సిపిఎం రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు. వామపక్ష పార్టీల పోరాటం ఫలితంగానే ఉపాధిహామీ చట్టం వచ్చిందని, వ్యవసాయ పనులు లేని సమయంలో ఈ చట్టం వల్లే పేదలకు పట్టెడన్నం దొరుకుతోందని గుర్తు చేశారు. పేదలకు ఉపయోగపడే ఈ చట్టానికి మరిన్ని నిధులు కేటాయించాల్సిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేసేందుకు కుట్రలు పన్నుతుందని ఆరోపించారు. బడా పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయలు సబ్సిడీ ఇస్తున్న బిజెపి ప్రభుత్వం పేదల కడుపునింపే ఉపాధి హామీ చట్టానికి కేంద్ర బడ్జెట్లో నిధులు తగ్గించడం అన్యాయమన్నారు. ఒకేసారి చట్టాన్ని రద్దు చేస్తే తిరుగుబాటు వస్తుందనే భయంతో ఉపాధిహామీ పనుల్లో ఒక పూట బదులు రెండు పూటలా పని చేయాలని ఒత్తిడి తీసుకురావడం, సమ్మర్ అలవెన్స్ రద్దు, తాగునీరు, పార, తట్ట, గడ్డపార పదునుకు ఇచ్చే సొమ్ము నిలిపి వేసిందని, ఆన్‌లైన్ మస్తర్లు పెట్టి పేదలను హింసిస్తోందని విమర్శించారు. కూలీలకు కేటాయించే నిధులను రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం సిమెంట్ రోడ్లు, భవనాలకు మళ్లించి పేదల కడుపు కొడుతోందని తెలిపారు. పోరాడి సాధించుకున్న ఈ ఉపాధిహామీ చట్టాన్ని కాపాడుకునేందుకు, పని దినాలు, వేతనాలు పెంచుకునేందుకు, పట్టణ ప్రాంతాల్లో కూడా అమలు చేయించుకునేందుకు పోరాడాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీలో తక్షణమే మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించి ఏజెన్సీలో మారుమూల గ్రామాలకు వైద్య సిబ్బందిని పంపి, మందులు సరఫరా చేసి మొబైల్ మెడికల్ క్యాంపులు చేపట్టాలని కోరారు. ఏజెన్సీలో మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలతో జనం అల్లాడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రేషన్ సర్వర్ల మొరాయింపుతో ప్రజలు రేషన్ వాహనాల వద్ద పడిగాపులు కాస్తున్నారని, రేషన్ పంపిణీలో కేవలం బియ్యం, పంచదారే కాకుండా నిత్యావసర సరుకులు కూడా రాష్ట్ర ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, తెల్లం రామకృష్ణ, ఎం.నాగమణి, జి.రాజు పాల్గొని మాట్లాడారు.



మాట్లాడుతున్న మంతెన సీతారాం

విభిన్న ప్రతిభావంతుల్లో ఆత్మస్థైర్యం నింపాలి

సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



ప్రజాశక్తి - ఏలూరు

విభిన్న ప్రతి భావం తులు ఆత్మస్థైర్యంతో జీవించేలా సామాజిక న్యాయం సాధికారత సూత్రాల ఆధారంగా సమన్వయ కమిటీ కృషి చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి శుక్రవారం ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి సమన్వయ కమిటీ రెండో సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలన్నీ వారికి చేరేలా అధికారులు, సమన్వయ కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. గత ఏప్రిల్ 24న విభిన్న ప్రతిభావంతుల సమన్వయ కమిటీ తొలి సమావేశంలో కమిటీ సభ్యులు సూచించిన ప్రగతి అంశాలపై తీసుకున్న చర్యల గురించి జిల్లా విభిన్న ప్రతిభావంతుల అసిస్టెంట్ డైరెక్టర్ జిసిహెచ్.ప్రభాకర్ వివరించారు. సదరం ధ్రువపత్రంలో తప్పుల సవరణ నిమిత్తం అనగా విభిన్న ప్రతిభావంతుని పేరు, తండ్రి పేరు, చిరునామా, పుట్టిన తేదీ తదితర సమాచారం, వైకల్య శాతం మినహా మిగిలిన సమాచారం మార్పు చేసుకోవడంపై జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.విజయరాజు వివరణిస్తూ తప్పుల సవరణ నిమిత్తం విభిన్న ప్రతిభావంతుల దరఖాస్తు చేసుకుంటే వారి పెన్షన్ తొలగించడం జరుగుతుందనే అపోహ తగదని, దానిలో నిజం లేదని అన్నారు. విభిన్న ప్రతిభావంతులు నిరభ్యంతరంగా సదరం ధ్రువపత్రంలో మార్పులు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి ప్రభుత్వ శాఖలలోను విభిన్న ప్రతిభావంతుల ప్రమోషన్లు రోస్టర్ ప్రకారం ఇచ్చేలా చూడాలని, ఆర్‌పిడి యాక్ట్‌పై అవగాహన కల్పించాలని, ఆర్‌పిడి రూల్స్ బేనర్స్, పుస్తకాల ద్వారా అవగాహన కల్పనకు చర్యలు తీసుకోవాలని, విభిన్న ప్రతిభావంతులకు కమ్యూనిటీ భవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలని, ఆర్‌టిసి ద్వారా విభిన్న ప్రతిభావంతులకు సేవలు పూర్తిస్థాయిలో అందించేలా చర్యలు తీసుకోవాలని, కలెక్టరేట్‌లో విభిన్న ప్రతిభావంతులకు గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని, సింగిల్ రేషన్ కార్డు అందించాలని, వివిధ వ్యాపారాలకు ఫైనాన్స్‌గా బ్యాంకు రుణాలు ఇప్పించాలని, పిల్లలకు ఆరోగ్యశ్రీ వర్తింపజేయాలని, విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి స్కిల్స్‌ను అభివద్ధి చేయాలని తదితర అంశాలను చర్చించారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డాక్టర్ కె.పాల్ సతీష్‌కుమార్, డాక్టర్ నాగేశ్వరరావు, జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ నీలాద్రి, విభిన్నప్రతిభావంతుల ప్రతినిధులు జిడివిఎస్.వీరభద్రరావు, జి.రాధారాణి, మదన్, యుగంధర్, సిహెచ్.జాకబ్, ప్రవీణ్‌వర్మ, వి.నాగబాబు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత విద్యుత్ అందించాలి

చింతలపూడి: 200 యూనిట్లలోపు వినియోగించే పేదలందరికీ ఉచిత విద్యుత్ అందించాలని సిపిఎం మండల నాయకులు ఆర్‌విఎస్.నారాయణ, సిపిఐ మండల కార్యదర్శి గురవయ్య, సిపిఐ(ఎంఎల్) జిల్లా నాయకులు రంగనాథ్, సిపిఎం పట్టణ నాయకులు సూర్యకుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలో పాత బస్టాండ్ డా.బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ప్రజలపై విద్యుత్ భారాలు మోపవద్దని, పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని సంతకాల సేకరణ, ప్రజాబ్యాలెట్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో వాడుకున్న కరెంటుకు తదుపరి భారం వేసే విధానాన్ని రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల బిగింపు నిలిపివేయాలని తెలిపారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని కోరారు. విద్యుత్ సవరణ బిల్లు-2020ను ఉపసంహరించుకోవాలన్నారు. జర్నలిస్టులపై, పౌరహక్కుల సంఘాల నాయకులపై ఎన్ఐఎ దాడులను నిలుపుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాబు వజ్రం, జాని మాణిక్యాలరావు, సత్యనారాయణ, యస్.జోపి, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆయకట్టు రైతులకు సాగునీరందించాలి

రైతు సంఘం ఆధ్వర్యాన ఆందోళన

ఏలూరు రూరల్ : ఓల్డ్ జాలిపూడి కాలువ పరిధిలో ఆయకట్టు రైతులకు సాగునీరు అందించి, పంటలు కాపాడాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేపట్టారు. శుక్రవారం జాలిపూడిలో రైతు సంఘం నాయకులు పర్యటించి సాగునీరందని పంట పొలాలను పరిశీలించారు. వరి దుబ్బులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఏలూరు రూరల్ మండలం జాలిపూడి, కాట్లంపూడి గ్రామాల పరిధిలో ఓల్డ్ జాలిపూడి కాలువ ఆయకట్టు పంట పొలాలకు సక్రమంగా సాగునీరు అందక అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణా డెల్టాకు శివారు ఆయకట్టుగా ఉన్న ఓల్డ్ జాలిపూడి కాలువ పరిధిలో పంటలకు సాగునీరు విడుదల చేసి, పంటలను కాపాడి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రంగారావు, బైరెడ్డి లక్ష్మణరావు, బల్లవరపు రాంబాబు పాల్గొన్నారు.

వ్యవసాయంలో లాభసాటి విధానాలు అవలంబించాలి

ఏలూరు అర్బన్ : వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు ఉండాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు తెలిపారు. శుక్రవారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నర్సింహా అధ్యక్షతన నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా స్థాయి విజ్ఞాన తరగతులలో ఆయన మాట్లాడారు. రైతుల వ్యవసాయాన్ని కార్పొరేట్ వ్యవసాయంగా మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. దేశంలో నూటికి 60 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని, వ్యవసాయమే జీవనాధారంగా ఉందన్నారు. రైతుల వ్యవసాయం కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి పూర్తిగా వెళ్లిపోతే దేశ ప్రజలు, రైతాంగం తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సులను ప్రభుత్వాలు అమలు చేయడం లేదన్నారు. ఫలితంగా కోఆపరేటివ్ వ్యవసాయం కాస్త కార్పొరేట్ వ్యవసాయంగా మారిపోతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు తమ విధానాలు మార్చుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విధానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వాలకు తగిన వ్యవసాయ ప్రణాళిక లేదన్నారు. ఈ తరగతుల్లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు కట్టా భాస్కరరావు, బొడ్డు రాంబాబు, కె.జలపాలు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు ప్రత్యేక కంట్రోల్ రూమ్

రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు
జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రస్తుత ఖరీఫ్‌లో ధాన్యం సేకరణలో ఎటువంటి సమస్యలు లేకుండా ఉండేందుకు జిల్లాలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్‌లో 5.77 లక్షల మెట్రిక్ ధాన్యం దిగుబడి అంచనా వేస్తున్నామని, అందుకు తగిన విధంగా ఎటువంటి సమస్యలు లేకుండా ధాన్యం సేకరణకు అధికారులందరూ పూర్తి సన్నద్ధతతో ఉండాలన్నారు. ధాన్యం పండించిన రైతుకు ముఖ్యంగా సన్న, చిన్నకారు రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం సేకరణ చేయాలన్నారు. ధాన్యం సేకరణలో వచ్చే సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేయాలని, కంట్రోల్ రూమ్‌కు వచ్చే ప్రతీ సమస్యకు వెంటనే పరిష్కారం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కంట్రోల్ రూమ్ నెంబర్‌ను జిల్లాలోని ప్రతీ రైతు భరోసా కేంద్రంలోనూ ప్రదర్శించాలని తెలిపారు. గోనెసంచుల కొరత రాకుండా, ధాన్యం రవాణాకు వాహనాలు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ధాన్యం రవాణాకు 3 వేల వాహనాల వరకు అవసరం అవుతాయని అంచనా వేశామని, అందుకు తగిన విధంగా జిపిఎస్ ట్రాకింగ్ విధానం కలిగిన వాహనాలు సిద్ధం చేసేలా జిల్లాలోని లారీ ఓనర్స్ అసోసియేషన్స్ వారితో సమన్వయం చేసుకోవాలని ఉప రవాణా కమీషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు.

జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం సేకరించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ధాన్యం రవాణాకు లారీలతో పాటు, ఇరుకు రోడ్లు ఉన్న గ్రామాలలో వినియోగించేందుకుగాను ట్రాక్టర్‌లను కూడా సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్, జిల్లా పరిషత్ సిఇఒ కె.రవికుమార్, డిఆర్‌డిఎ పిడి కె.విజయరాజు, ఉప రవాణా కమీషనర్ ఎస్.శాంతకుమారి, జిల్లా వ్యవసాయశాఖాధికారి వై.రామకృష్ణ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు మంజూ భార్గవి, డిఎస్ఒ ఆర్ఎస్ఎస్ఎస్ రాజు, సహకార శాఖ అధికారులు, జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు సతీష్ చౌదరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పెట్రోల్, డీజిల్, గ్యాస్ వంటి ఇంధనాల పన్నులతో లక్షల కోట్ల రూపాయలు సంపాదించి పెడుతున్న రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగసూరిబాబు అధ్యక్షతన జరిగిన ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశంలో ప్రధాన కార్యదర్శి జె.గోపి, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడారు. కార్పొరేట్ కంపెనీలకు రవాణా రంగాన్ని మొత్తంగా అప్పజెప్పేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని, రవాణా రంగ చట్ట సవరణ అందుకు అద్దం పడుతుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక చట్టాలకు, మన రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాలు మద్దతివ్వడాన్ని కార్మిక వర్గం ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా జిఒ నెంబర్ 21 తీసుకువచ్చి, మన రాష్ట్రంలోని రవాణా రంగాన్ని సంక్షోభంలోకి నెట్టివేసిన జగన్‌మోహన్ రెడ్డికి తగిన గుణపాఠం నేర్పాలని కోరారు. పక్క రాష్ట్రాల కంటే డీజిల్ ధరలు దాదాపు పది రూపాయల వరకు అదనంగా వసూలు చేస్తున్నారని, పొరుగు రాష్ట్రాల లారీ ఆపరేటర్లతో, మన రాష్ట్ర లారీ ఆపరేటర్లు పోటీ పడలేక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రవాణా రంగ కార్మికులను ఆదుకునేలా కేరళ తరహా వెల్ఫేర్ బోర్డును మన రాష్ట్రంలో అమలు చేయాలని కోరారు. జిల్లాలో ఆటో రిక్షాలు నిలుపుకునేందుకు, ఇతర రవాణా వాహనాలు నిలుపుకునేందుకు, పార్కింగ్ స్థలాలను కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో జివి రవీంద్రబాబు, నత్త వెంకట్, చక్రాల అమర్ కుమార్, మెరుగు రాఘవ, గూట్ల జయరాజు తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా ఆటోనగర్ ఎన్నికలు

స్థానిక సర్పంచికి సమాచారం ఇవ్వలేదంటూ ఒక పక్షం దాడి
పోలీసులు రంగ ప్రవేశం, చర్చలు
అర్థాంతరంగా నిలిచిపోయిన ఎన్నికలు

ఏలూరు టౌన్ : ఆటో మొబైల్ మెకానిక్స్ అసోసియేషన్‌కు శుక్రవారం నిర్వహించాల్సిన ఎన్నికలు అర్థాంతరంగా నిలిచిపోయాయి. జిల్లా ఉన్నతాధికారులు అనుమతి ఇచ్చారంటూ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఎంపిక చేసినట్టుగా చెబుతున్న ఎన్నికల కమిటీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేసింది. 312 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా కమిటీ భారీ కేడ్లుతో ఏర్పాట్లు చేసింది. ఒక వ్యక్తి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ దశలో ఏలూరు రూరల్ మల్కాపురం సర్పంచి పత్యాల సునీత, స్థానిక ఎంపిటిసి బంధువులు ఒక్కసారిగా ఎన్నికల కేంద్రం వద్దకు వచ్చి భారీ కేడ్లను తొలగించి, ఓటింగ్ బాక్సులను విసర గొట్టారు. తమ పంచాయతీ పరిధిలో ఉన్న ఆటోనగర్ అసోసియేషన్‌కు జరుగుతున్న ఎన్నికలపై తమకు కనీస సమాచారం లేదంటూ విరుచుకుపడ్డారు. ఆటోనగర్ అసోసియేషన్ రెండు వర్గాలుగా విడిపోయిన నేపథ్యంలో మాజీ అధ్యక్షుడు మాగంటి నాగభూషణం వర్గంలలో కొందరు కూడా ఇందులో పాల్గొన్నట్టు సమాచారం. అయితే కొన్ని అనివార్య కారణాలతో ఎన్నికల సమాచారం ఇవ్వలేకపోయామని ఎన్నికల కమిటీ తెలియజేసినా వారు వినలేదు. ఈ విషయం పోలీసులకు సమాచారం అందడంతో ఏలూరు టౌన్, రూరల్ సిఐలు, ఎస్ఐలు వారి సిబ్బందితో భారీ ఎత్తున అక్కడికి చేరుకున్నారు. మీరంతా మాట్లాడుకుని ఒక నిర్ణయానికి రావాలని పోలీసులు సూచించడంతో అందరూ చర్చలు జరిపారు. అయితే చర్చలు విఫలం కావడంతో న్యాయవాది సూచన మేరకు 3 నెలల తర్వాత కోర్టు నిర్ణయం మేరకు ఎన్నికలు జరుపుకోవాలని సూచించినట్టు తెలుస్తోంది. దీంతో ఎన్నికలు తాత్కాలికంగా నిలిపేస్తున్నట్టు ప్రకటించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

చింతలపూడి : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించే విధంగా విద్యాబోధన జరగాలని ఎంఇఓ-2 కిరణ్‌బాబు తెలిపారు. మండలంలో ఎంపిపియస్ బాలవారి గూడెం పాఠశాలను సందర్శించి, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్క విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ పెట్టాలన్నారు. విద్యాబోధన జరిగిన తరువాత విద్యార్థులతో పాఠ్యాంశాలపై చర్చలు జరిపితే బాగా గుర్తుండిపోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణు పాల్గొన్నారు.

బసవారెడ్డికి పలువురి పరామర్శ

చాట్రాయి : గత మంగళవారం మండల కేంద్రమైన చాట్రాయి గ్రామానికి చెందిన రైతు మందపాటి నరసింహారెడ్డి పాము కాటుతో మృతి చెందడంతో ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నరసింహం శుక్రవారం టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవా రెడ్డికి సానుభూతిని తెలియజేశారు. పాముకాటుతో మరణించిన నరసింహారెడ్డి మందపాటి బసవా రెడ్డికి సోదరుడు కావడంతో మండలానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు చాగంటి రాజారావు, పాపారావు, సిఐటియు నాయకులు పిఎన్ఎమ్ సూరి, మహిళా నాయకురాలు హెలాన్ మేరీ, సిపిఐ మండల అధ్యక్షుడు కొలికిపోగు భాస్కరరావు ఆధ్వర్యంలో కలిసి వెళ్లి బసవారెడ్డికి సానుభూతిని తెలియజేశారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఏలూరు : ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్, శ్రీకృష్ణ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఎముకలు, కీళ్లు, నరములు, వెన్నెముక శస్త్రచికిత్స వైద్యంలో సుదీర్ఘ అనుభవం గల డా.బి.కృష్ణచే ఉచిత వైద్యశిబిరం ప్రతీ నెల రెండవ శనివారం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ నాయకులు తెలిపారు. ఈనెల 14వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు శ్రీకృష్ణ హాస్పిటల్లో ఓపి, రక్త పరీక్షలు మొదలైన పరీక్షలు నిర్వహించి వైద్యం అందిస్తారన్నారు. ఏలూరు చుట్టుపక్కల ప్రజలు వీరి సేవలు వినియోగించి కోవాల్సిందిగా కోరారు.

నూజివీడు పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్‌పి

నూజివీడు రూరల్ : పట్టణ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్‌పి దాసరి మేరీ ప్రశాంతి శుక్రవారం సందర్శించారు. ఆమె పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించి, పరిసర ప్రాంత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి అశోక్ కుమార్ గౌడ్, పట్టణ సిఐ మూర్తి, రూరల్ సిఐ బాల సురేష్ బాబు, పట్టణ రూరల్ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'గ్రామాలకు సచివాలయాలే పట్టుగొమ్మలు'

ముసునూరు : గ్రామాలకు గ్రామ సచివాలయాలే పట్టుకొమ్మలని నూజివీడు నియోజకవర్గ ఎంఎల్‌ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు తెలిపారు. శుక్రవారం మండలంలోని కొర్లగుంట గ్రామంలో రూ.20.80 లక్షల నిధులతో నిర్మించిన నూతన సచివాలయాన్ని ఎంఎల్‌ఎ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి, కొర్లగుంట సొసైటీ అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ గుడ్డు దినోత్సవం

కొయ్యలగూడెం : ఇంటర్‌నేషనల్ ఎగ్ డే సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గుడ్డు ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతిరోజు 'గుడ్డు తినండి ఆరోగ్యంగా ఉండండి' అని కోడిగుడ్లను చేతితో పట్టుకుని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పిఓ స్వర్ణకుమారి, సూపర్‌వైజర్ వెంకటాయమ్మ, డాక్టర్ ఎస్తేరు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

వర్షాభావంతో 'అన్నదాతలు' విలవిల..

ప్రజాశక్తి - చాట్రాయి



నీరు లేక ఎండిపోతున్న వరి పైరు

చాట్రాయి మండలం మెరక ప్రాంతం కావడంతో వర్షాధారమే పంటలకు ఆధారం.. అధిక ఎకరాల్లో వరి పంట పొలాలలో బోర్లు లోని నీరు అడుగంటి పోవటంతో, సరైన వర్షాలు లేక వరి పైరు ఎండిపోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. తుఫానుల కారణంగా పడిన వర్షం తప్ప కాలానుగుణంగా సరైన వర్షాలు ఈ సంవత్సరం పడలేదని మండల రైతులు నిరాశ చెందుతున్నారు. అసలే మెట్ట ప్రాంతం కావడంతో వేల రూపాయలు ఖర్చుపెట్టి బోర్లు వేయించినా, ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. వరి పైరు పొట్ట దశలో ఉండగా తగిన నీరు లేక పోవడం వల్ల వరి కంకులలో తాలు గింజలు ఎక్కువగా కనిపిస్తున్నాయని, సరైన ఎదుగుదల లేక దిగుబడి రావటం కష్టంగా ఉందని వాపోతున్నారు. రైతులు వేల రూపాయలు పెట్టుబడి పెట్టి ఎరువులు, పురుగు మందులు వాడి పంట చేతికి వచ్చే సమయంలో సరైన దిగుబడి రాక, తెచ్చిన అప్పులు తీర్చలేక, అప్పుల పాలై కొందరు రైతులు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై సంబంధిత మండల వ్యవసాయ అధికారి బి.శివశంకర్ వివరణ అడగగా మండలంలోని మొత్తం 11,500 ఎకరాలలో వరి పంట రైతులు సాగు చేస్తున్నారని తెలిపారు. మండలంలోని చాట్రాయి, పోలవరం, మంకొల్లులో తమ్మిలేరు రిజర్వు ప్రాజెక్టులోని నీరు వ్యవసాయానికి కాలువల ద్వారా రైతులు ఉపయోగించుకుంటున్నారన్నారు. నరసింహారావు పాలెం, చిత్తపూరు గ్రామాలలో నీటి సౌకర్యం లేక పంటలు ఎండిపోతున్నాయని తెలియజేశారు.

చిన్నారి వైద్యానికి సిఎం సహాయ నిధి అందజేత

పోలవరం : పోలవరం గ్రామానికి చెందిన భరణికాన సురేష్ కుమారుడు సోహన్ సాయి ఈశ్వర్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు చిన్నారి వైద్యానికి రూ.లక్షా 50 వేల సిఎం సహాయ నిధి నుంచి మంజూరు చేయించి, ఎల్ఓసి పత్రాన్ని అందజేశారు. చిన్నారికి మెరుగైన వైద్యం కోసం లక్షా 50 వేల రూపాయలు అవసరమవుతాయని ఎంఎల్‌ఎకు తెలియపరచగా, తక్షణమే స్పందించి సిఎం దృష్టికి తీసుకువెళ్లి, వైద్య ఖర్చులకు అవసరమైన రూ.లక్ష 50 వేలు మంజూరు చేయించి, ఎల్ఓసి పత్రాన్ని దుద్దుకూరు గ్రామంలో క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారి తల్లిదండ్రులు సిఎం, ఎంఎల్‌ఎకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించాలి

ఏలూరు టౌన్ : ఏఐటియుసి 104వ వ్యవస్థాపక దినోత్సవం మున్సిపల్ కార్మికులు ఘనంగా నిర్వహించాలని ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఏఐటియుసి కార్యాలయంలోని స్ఫూర్తి భవనంలో కార్యవర్గ సమావేశం నగర యూనియన్ అధ్యక్షులు యలగాడ దుర్గారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న భజంత్రీ శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ సమావేశంలో కార్యనిర్వాహక అధ్యక్షులు యలగాడ శివకుమార్ పాల్గొన్నారు.

బెన్నీ సేవలు మరువలేం : రెడ్‌క్రాస్

ఏలూరు అర్బన్ : బెన్నీ రెడ్‌క్రాస్‌కు అందించిన సేవలు మరువలేనని, ఆయన సూచనలు, సేవలు భవిష్యత్తులో కూడా రెడ్‌క్రాస్‌కు కావాలని రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి కోరారు. జిల్లా రెడ్ క్రాస్ కార్యదర్శిగా రెండు సంవత్సరాలు విశేష సేవలు అందించి, స్వచ్ఛందంగా పదవీ విరమణ చేసిన బోడపాటి బెన్నీని జిల్లా రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి, రెడ్ క్రాస్ సిబ్బంది ఘనంగా సత్కరించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి మాట్లాడుతూ బెన్నీ స్థానంలో రెడ్‌క్రాస్ కార్యదర్శిగా పెనుమంట్ర రిటైర్డ్ తహశీల్దార్ కెబి సీతారాంకు బాధ్యతలను అప్పగించినట్లు పేర్కొన్నారు. బెన్నీ మాట్లాడుతూ రెండు సంవత్సరాల విధి నిర్వహణలో తనకు సహకరించిన ఛైర్మన్ కృష్ణారెడ్డికి, రెడ్‌క్రాస్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె వరప్రసాదరావు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు : ఎంపిపి

చింతలపూడి : కుల,మత బేధాలు లేకుండా, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని చింతలపూడి ఎంపిపి రాంబాబు తెలిపారు. పట్టణంలో మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామల సర్పంచులు, ఎంపిటిసిలు రోడ్లు, ఇబ్బందులు గురించి చర్చించారు. అనంతరం చింతలపూడి మండలం యర్రగుంటపల్లి పిహెచ్‌సికి మంజురైనా 7 పడకల హస్పటల్ రాఘవపురం పిహెచ్‌సికి తరలించటానికి తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎయంసి ఛైర్మన్ జానాకిరెడ్డి పాల్గొన్నారు.

పండుగ రోజూ.. 'పప్పన్నం లేదు'

నిత్యావసర సరుకులు సరఫరా చేయలేకపోతున్న పౌరసరఫరాల శాఖ

ప్రజాశక్తి - చాట్రాయి

ఈనెల నుంచైనా రేషన్ వాహనాల ద్వారా బియ్యంతో పాటు పప్పు ఇస్తారని ఎదురుచూస్తున్న పేదలకు ఈనెలలో కూడా నిరుత్సాహమే మిగిలింది. శుక్రవారం చిన్నంపేట గ్రామంలో రేషన్ బియ్యం ఇస్తున్న వాహనం దగ్గర ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు కొమ్ము ఆనందం నిరసన తెలిపారు. రేషన్ వాహనాల ద్వారా బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారని కందిపప్పు అసలు ఇవ్వటం లేదని, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని చిన్నంపేటలో రేషన్ వాహనం దగ్గర ఆందోళన వ్యక్తం చేశారు. దసరా పండగ రోజైనా పప్పన్నం తిందామని ఎంతోమంది ఎదురుచూస్తున్నటు వంటి పేదల ఎదురు చూపులకు కందిపప్పు కనిపించడం లేదు. ఈనెలలో అన్నీ ఇస్తామని ప్రభుత్వం చెబుతుంది. కానీ ఆచరణలో మాత్రం కందిపప్పు ఇవ్వడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టించుకొని, దసరా నాటికైనా కందిపప్పు ఇప్పించాల్సిందిగా ఆనందం ప్రభుత్వాన్ని కోరారు.



రేషన్ వాహనం వద్ద నిరసన తెల్పుతున్న ఆనందం

ప్రజా సంక్షేమమే.. ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ప్రజా సంక్షేమమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని పోలవరం నియోజకవర్గ ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు పేర్కొన్నారు. శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా అంకన్నగూడెం పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గడప గడపకు తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగున్నర సంవత్సరాలుగా ఎన్నో అభివృద్ధి పథకాలను ప్రవేశ పెట్టిన ఘనత ఒక్క వైసిపి ప్రభుత్వానికే సాధ్యమైందన్నారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు గ్రామాల్లోని పలు సమస్యలను ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం నూతన సచివాలయ భవనాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కోర్స పోసమ్మ, జెడ్‌పిటిసి వసంతరావు, సర్పంచులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష ద్వారా 24 గ్రామాల్లో 9,123 ఓపి నమోదు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద శుక్రవారం 24 గ్రామాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షలో సాయంత్రం 5 గంటల వరకు 9 వేల 123 ఓపి నమోదైందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.ఎస్.శర్మిష్ట తెలిపారు. వీరిలో మహిళలు 5 వేల 094 మంది కాగా, పురుషులు 4 వేల 029 మంది వున్నారు.



ముసునూరులోని కోర్లగుంటలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ అప్పారావు

ముసునూరు : పేద, మధ్యతరగతి, ఉన్నత అనే తేడా లేకుండా అందరికి వైద్యం అందేలా ఈ జగనన్న సురక్ష కార్యక్రమం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని నూజివీడు ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తెలిపారు. శుక్రవారం మండలంలోని కోర్లగుంట గ్రామంలో సర్పంచి నక్కనబోయిన సత్యనారాయణ, ఎంపిడిఒ జి.రాణిల ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజనాయన, ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి, మండల వైసిపి అధ్యక్షులు కోర్లగుంట సొసైటీ అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, సర్పంచి పేరం కృష్ణ, తహశీల్దార్ దాసరి సుధ, వైద్యులు యం.కిరణ్‌కుమార్, డాక్టర్ కరిముల్లా, ఎంపిటిసి కొండా దుర్గాభవాని పాల్గొన్నారు.

చింతలపూడి : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిఒక్కరు ఉపయోగించుకోవాలని ఉర్లగూడెం సర్పంచి యువరాజు తెలిపారు. మండలంలోని ఉర్లగూడెం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కృష్ణజ్యోతి, ఎంపిడిఒ మురళీకృష్ణ పర్యవేక్షించారు. అంగన్‌వాడీ స్టాల్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : పరింపూడి సచివాలయం-1లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి ముప్పిడి విజయ కుమారి, ఉపసర్పంచి సంకొండల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ రకాల అనారోగ్యాలకు ఉచిత చికిత్స ప్రజలకు అందించారు. పంచాయితీ ఈవో సిహెచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు

బుట్టాయగూడెం : మండలంలోని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు పాల్గొన్నారు. అనంతరం ఆయన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం శాంతి, జెడ్‌పిటిసి మొడియం రామతులసి పాల్గొన్నారు.

చంద్రబాబుకు మెరుగైన వైద్యం అందించాలి : టిడిపి

ప్రజాశక్తి - చింతలపూడి

చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి జైలులో పెట్టడమే కాకుండా, జైలులో సరైన వసతులు లేకపోవడంతో అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని టిడిపి నియోజకవర్గ పరిశీలకులు కోళ్ల నాగేశ్వరరావు, నియోజకవర్గ మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి, మాజీ ఎంఎల్‌ఎ ఘంటా మురళీకృష్ణ తెలిపారు. చంద్రబాబుకి ఫ్యామిలీ డాక్టర్‌తో వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం టిడిపి కార్యాలయం వద్ద రోడ్డుపై బైఠాయించి చంద్రబాబు నాయుడుకి మెరుగైన వైద్యం అందించాలని, జడ్ ప్లస్ సెక్యూరిటీ కల్పించాలని రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వెంకట్రామయ్య, టిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్ కుమార్, టౌన్ ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం, మారుమూడి థామస్, అంకమరావు, గుత్తా వెంకటేశ్వరరావు, అమ్ములు, మానేపల్లి రాజారావు, నాగేశ్వరరావు, దారా వీరేంద్ర పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ కొయ్యలగూడెంలో నిరసన 31 వ రోజుకు చేరుకుంది. అక్రమ అరెస్టుకు టిడిపి అధికారంలోకి రాగానే బదులు చెబుతామని టిడిపి కార్యకర్తలు హెచ్చరించారు. యువ గళం సక్సెస్ అవుతుందనే నెపంతోనే బాబును అరెస్టు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మద్దుకూరి నవీన్, గోడపాటి సతీష్, మద్దుకూరి సాయి, తమ్మినీడు చౌదరి, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

టి.నరసాపురం : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరుతూ మండలంలోని బందంచర్ల గ్రామంలో లోకేష్ సేవాదళ్ నాయకులు ఘంటా సతీష్ ఆధ్వర్యంలో శుక్రవారం రాజమండ్రి సెంటర్ జైలు సూపరింటెండెంట్‌కు మహిళలు పోస్టు కార్డులు రాశారు. చంద్రబాబు నిర్దోషిగా బయటకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ముసునూరు : చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి జైలులో ఆయనకు ఎటువంటి సౌకర్యాలు కల్పించకుండా హింసిస్తున్నారని మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు విమర్శించారు. ఈ కార్యక్రమంలో గద్దే రఘు బాబు, లక్క పాము కాంతారావు, గారపాటి నరసింహారావు, మెదరమెట్ల సురేంద్ర పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

కోడి వ్యర్థాలను తరలిస్తున్న ఇద్దరిపై కేసు

టి.నరసాపురం : కోడి వ్యర్థాలను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.సురేంద్ర కుమార్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా నిడమర్రు మండలం తోకలపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కోడి వ్యర్థాలను తెలంగాణ రాష్ట్రం వరంగల్ పరిసర ప్రాంతాల నుంచి నిడమర్రుకు తరలివస్తున్నారనే సమాచారం అందిందన్నారు. దీంతో మండలంలోని బొర్రంపాలెం గ్రామ శివార్లలో వాహనాల తనిఖీ చేసి, రెండు టన్నుల కోడి వ్యర్థాలతో పాటు, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. తహశీల్దార్ అనుమతితో డిస్పోజబుల్ చేశామన్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లక్కవరంలో ఆందోళన విరమణ

జంగారెడ్డిగూడెం : మండలంలోని లక్కవరంలో సుబ్బారెడ్డి మృతి చెందడంపై చేపట్టిన ఆందోళనను సిఐ రాజేష్ హామీ ఇవ్వడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు విరమించారు. వివరాల్లోకెళితే.. ఇటీవల ఆత్మహత్యకు ప్రయత్నించిన సుబ్బారెడ్డి వైద్యం పొందుతూ గుంటూరులో గురువారం మృతి చెందాడు. ఈ నేపథ్యంలో లక్కవరం ప్రధానం సెంటర్ వద్ద సుబ్బారెడ్డి బంధువులు, స్థానికులు మృత దేహంతో ఆందోళన చేపట్టారు. సుబ్బారెడ్డి మృతికి కారణమైన పదిమందిపై 306 సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు సిఐ పి.రాజేష్ తెలిపారు. పది మందిని అరెస్టు చేసి, జైలుకు పంపిస్తామని సిఐ బాధిత కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఎఫ్ఐఆర్ కాపీని కుటుంబ సభ్యులకు అందజేయడంతో ఆందోళన విరమించారు.

తెలంగాణా మద్యం స్వాధీనం

చింతలపూడి : తెలంగాణా మద్యం పట్టుకున్నట్లు ఎస్ఇబి సిఐ సాయి స్వరూప్ తెలిపారు. చింతలపూడి స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో నాగిరెడ్డి గూడెం గ్రామంలో చింతలపూడి సెబ్ సిబ్బంది దాడులు జరిపి భూక్యా కృష్ణవేణి అనే మహిళపై కేసు నమోదు చేసి, ఆమె వద్ద నుంచి రూ.5 వేలు విలువ చేసే 20 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడులలో చింతలపూడి సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

'కుటుంబ దత్తత' ద్వారా వైద్య విద్య సుసంపన్నం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

'కుటుంబ దత్తత కార్యక్రమం' వైద్య విద్యను సుసంపన్నం చేస్తుందని ఆర్.విజయరాజు తెలిపారు. శుక్రవారం ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఏలూరు రూరల్ చాటపర్రు పిహెచ్‌సి సెమీ అర్బన్ పరిధిలో 750 కుటుంబాలను స్థానిక ఎఎన్ఎం, ఆశ కార్యకర్తల సహకారంతో మాపింగ్ కార్యక్రమం జరిగిందని ఆయన తెలిపారు. 'కుటుంబ దత్తత కార్యక్రమం' ప్రతి వైద్య విద్యార్థిని మూడు నుంచి ఐదు గ్రామీణ కుటుంబాలకు అనుసంధానం చేస్తుందన్నారు. విద్యార్థి నెలకోసారి ఈ కుటుంబాలను సందర్శించాల్సి ఉంటుందని తెలిపారు. అనేక వైద్య కళాశాలలు ఇటీవల ప్రారంభ బ్యాచ్‌ల కోసం ఈ కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించాయన్నారు. ఈ సందర్భంగా ఏలూరు వైద్యకళాశాలకు చెందిన కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్‌ను, వైద్య విద్యార్థులను ఆయన అభినందించారు.

విఆర్‌ఒలకు ఉద్యోగోన్నతి కల్పించాలి

ఏలూరు అర్బన్ : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పనిచేస్తున్న అర్హులైన గ్రేడ్-1 విఆర్‌ఒలకు సీనియర్ అసిస్టెంట్‌లుగా వెంటనే ప్రమోషన్ కల్పించాలని, అలాగే గ్రేడ్-2 విఆర్‌ఒలకు, గ్రేడ్-1 విఆర్‌ఒలుగా ప్రమోషన్లు కల్పించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతి రాజు రవీంద్ర రాజు జిల్లాలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా రెవెన్యూ అధికారి బి.వెంకటేశ్వరావును కోరారు. జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు శుక్రవారం ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీరామ రామచంద్ర మూర్తి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు అక్బర్, అజయ్ పాల్గొన్నారు.

వణుదుర్రు సమస్యలు పరిష్కరించాలి

ముదినేపల్లి : వణుదుర్రులో దళితులు అనేక సమస్యలతో సతమతం అవుతున్నారు వాటిని పరిష్కరించాలని మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి చిన్నం మాధవ కోరారు. గ్రామ సమస్యలు పరిష్కరించాలని కైకలూరులో ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావును ఆయన స్వగృహంలో కలిసి సమస్యలతో కూడిన వినతిని అందజేశారు.

ప్రణాళికాబద్ధంగా ఉపాధి హామీ పనులు

జంగారెడ్డిగూడెం : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా 2024-2025 సంవత్సరంలో గ్రామంలో ఏఏ పనులు చేపట్టి, లక్ష్యాలు సాధించాలో గ్రామసభ ద్వారా గుర్తించటం జరుగుతుందని చక్రదేవరపల్లి గ్రామ పంచాయతీ సర్పంచి సాయిల సత్యనారాయణ తెలిపారు.

ఆశ్రమాల్లో చీరలు, దుప్పట్లు పంపిణీ

జంగారెడ్డిగూడెం : స్థానిక వైసిపి నాయకులు బివిఆర్ చౌదరి పుట్టినరోజు సందర్భంగా అభిమానులు స్థానిక సీతామహాలక్ష్మి అమ్మనాన్న వికలాంగులు, వృద్ధుల ఆశ్రమాలలో చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ డైరెక్టర్ చిప్పాడ వెంకన్న, కాసర బన్నీ పాల్గొన్నారు.

'రైతులకు చేదోడుగా మత్స్యశాఖ'

ఏలూరు టౌన్ : ఆంధ్రప్రదేశ్ మత్స్యశాఖ వివిధ పథకాల ద్వారా రైతులకు అన్ని రకాలుగా చేదోడుగా నిలుస్తోందని జిల్లా మత్స్యశాఖ అధికారి జివివి.సత్యనారాయణ తెలిపారు. రైతులకు సాగులో ఎటువంటి సమస్యలు ఎదుర్కొన్నా కైకలూరులో ఉన్న గవర్నమెంట్ రెఫెరల్ ఆక్వా ల్యాబ్ ద్వారా అన్ని రకాల పరీక్షలు చేయబడుతున్నాయని తెలిపారు. గ్రామస్థాయిలో విలేజ్ ఫిషరీష్ అసిస్టెంట్ ద్వారా మత్స్య సాగుబడుల సదస్సు ఏర్పాటు చేసి ఆక్వాసాగుకు సంబంధించి నాణ్యమైన యాజమాన్య పద్ధతులు ద్వారా రైతులకు సాగుపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆర్థికంగా కిసాన్ క్రెడిట్ కార్డ్ పథకం క్రింద తక్కువ వడ్డీకి రుణాలు అందజేస్తున్నామన్నారు. రైతులకు అన్ని విధాలుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, మత్స్య శాఖ నిరంతరాయంగా కృషి చేస్తూ సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు.

అటవీ శాఖ ప్లాంటేషన్ పరిశీలన

జీలుగుమిల్లి : మండలంలో అటవీ శాఖ అధ్వర్యంలో నాటిన కొత్త ప్లాంటేషన్‌లను శుక్రవారం రాజమండ్రి నుంచి వచ్చిన అటవీ శాఖ ప్రత్యేక బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని చంద్రమ్మ కాలనీలో గత సంవత్సర కాలంలో నాటిన మారు జాతి మొక్కల ప్లాంటేషన్‌లను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాంటేషన్‌లలో సంవత్సర కాలం నాటికే మొక్కలు సజావుగా పెరుగుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్క్వాడ్ రేంజ్ అధికారి రామారావు, జంగారెడ్డిగూడెం అటవీ శాఖ రేంజ్ అధికారిణి శ్రీవాణి, ఎఫ్ఎస్ఒ దుర్గాప్రసాద్, సిబ్బంది రహ్మాత్ పాల్గొన్నారు.

నేడు, రేపు నిర్వహించే ఎస్ఐ అభ్యర్థుల రాత పరీక్షకు పటిష్ట చర్యలు

ఏలూరు స్పోర్ట్స్ : ఏలూరు రేంజ్‌లో ఈనెల 14, 15 తేదీల్లో జరిగే ఎస్ఐ అభ్యర్థుల రాత పరీక్షకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లను పూర్తిచేసి, పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలను కల్పించామని ఏలూరు రేంజ్ డిఐజి అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం మధ్యాహ్నం బందోబస్తు ఏర్పాట్లపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా డిఎస్‌పిలకు, సిఐలకు, ఎస్ఐలకు ఆయన సూచనలు సలహాలు ఇచ్చారు.

దస్తావేజులు పోయినవి

పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం గ్రామీణ మండలం, వెంప గ్రామానికి చెందిన కొండేటి వెంకటేశ్వరరావు, తండ్రి: అర్జున్న అను నేను ఈ నెల రెండవ తేదీన వెంప గ్రామం నుండి 1967/2001 ఆఫ్ బుక్ 1 నెంబరు గల నా ఇంటి దస్తావేజులు జిరాక్సు నిమిత్తం మొగల్తూరు ద్విచక్ర వాహనంపై దస్తావేజులు తీసుకుని వెళుతుండగా మార్గమధ్యలో జారి పడిపోయినవి. ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

కొండేటి వెంకటేశ్వరరావు
తండ్రి: అర్జున్న, రజకుల రామాలయం దగ్గర, వెంప గ్రామం, భీమవరం గ్రామీణ మండలం.
సెల్: 99635 76955

మహారాజశ్రీ భీమవరం 1వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 147/2020

వాది: ఎర్రంసెట్టి వీర ఆంజనైలు
ప్రతివాదులు:
డి-2: కందుల రత్న కుమారి
డి-3: కందుల సంధ్య

Order 5 Rule 20 C.P.C. ప్రకారం ప్రతివాదులకు నోటీసు

పై నెంబరు దావాలో 2,3 ప్రతివాదులకు కోర్టు వారు ఎన్నిసార్లు సమన్సు పంపినా అమలు జరగనందున కోర్టు వారు దావాను **ది.30-10-2023 వ తేదీకి వాయిదా వేసినారు.** కావున 2,3 ప్రతివాదులు పై తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥10:00 ని॥లకు హాజరై వారి సంజాయిషీ తెలుపుకోవలసినదిగాను లేని పక్షంలో వారి పరోక్షంలో దావా తీర్మానం కాబడునని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

మోగంటి శివకృష్ణ
వాది తరపు లాయర్
భీమవరం, 13-10-23. సెల్: 98485 39039

In The Court Of The Prl. Senior Civil Judge At Khammam
I.A.No. 2/2022
In O.S.No. 428 of 2013

Between:
Om Shakthi Traders, Rep. by its Managing Partner Ch.Santhosh Kumar.
...Petitioner /Plaintiff
AND
1) Renuka Ginning Mills, Rep. by its Manager.
2) Danda Pullaiah
3) Mullapudi Renuka (Proposed Respondent /D3)
...Respondents /Defendants

TO: Dr.Mullapudi Renuka, D/o. Danda Pullaiah, Age Adult (TDP Mahila Leader, Tanuku, West Godavari District) Permanent R/o. H.No. 11-4-62/3, Nehru Nagar, Khammam City and District (Proposed Respondent /Defendant No.3)

Whereas the above named Petitioner /Plaintiff filed the above application under Order 1 Rule 10(2), R/W Sec.151 of CPC for added the Proposed Respondent /Defendant No.3 in the above matter and the same is stands posted on 31-10-2023 for your appearance either in person or through counsel duly instructed to file counter before the above said **Court at 10:30 A.M. on 31-10-2023,** if you fails to appear before the above said court the matter will be decided ex-party.

//By Order Of Court//
PEDDI HAYAGREEVA
Khammam, 11-10-2023. Advocate, Khammam. Cell: 98490 43167

In The Court Of The Principal Junior Civil Judge At Tanuku
O.S.No. 379 of 2022

Between:
Manthena Peddi Raju ...Plaintiff
AND
Satti Srinivasa Reddy, S/o. Satyanarayana Reddy, Near Sai Baba Temple, Vemana Street, Kommara Village, Attili Mandal, Tanuku J.C.J.C.
...Defendant

వాది తరపున వేయించిన ప్రకటన

ఇందుమూలముగా ప్రతివాదికి తెలియజేయునది ఏమనగా.., పై నెంబరు గ్రంధములో కోర్టు ద్వారా సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు సమన్లు పేపరు ప్రకటన ద్వారా ఆర్డరు వేసినారు. కావున ఈ ప్రకటన ప్రచురణ నుండి 30 రోజులలోపు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరు అయ్యి అభ్యంతరములు తెలుపు కొనవలెను. లేనిచో మీ పరోక్షమందు దావా విచారించబడునని ఇందుమూలముగా తెలియజేడయమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
రాయప్రోలు రాజు కిరణ్
ఆర్.ఏ.బేగమ్
తణుకు, 11-10-23 న్యాయవాదులు, తణుకు. సెల్: 83414 37279

పత్రికా ప్రకటన

In The Court Of The Hon'ble Principal Junior Civil Judge, Eluru, W.G.Dist., (Presently Eluru Dist.,)
I.A.No. 483/2021
in O.S.No. 190/2020

Manthena Kumar Babu
...Petitioner /Plaintiff
AND
Padala Satyam
...Respondent /Defendant

Respondent /Defendant:
Padala Satyam, S/o. Late Sanyasi, D.No. 20E-13-22, Pappalavari Veedhi, 16th Ward (Now 40th Division) Eluru, Eluru District.

పై నెంబరు పిటీషను గ్రంధములో రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారు ఎన్ని పర్యాయములు నోటీసు పంపిననూ మీరు ఉద్దేశ్యపూర్వకంగా సదరు నోటీసును అందుకొనక త్రోసిపుచ్చుచున్నారు. కావున ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా పై నెంబరు పిటీషను గ్రంధము ది.30-10-2023వ తేదీకి వాయిదా వేసినందున మీరు సదరు వాయిదా రోజు అనగా **ది.30-10-2023వ తేదీ ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా మీ ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ముందు హాజరై మీ వాదనను తెలియచేయ వలసినదిగా కోరడమైనది.** మీరు అట్లు హాజరు కాకపోయిన ఎడల శ్రీ కోర్టు వారు మిమ్ములను ఎక్స్‌పార్టీ చేసి, మీ పరోక్షములో పై నెంబరు పిటీషను గ్రంధమును తీర్మానించెదరని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
సబ్బి అజయ్ కుమార్
ఏలూరు, 12-10-23. అడ్వకేట్, ఏలూరు. సెల్: 80740 60191